## క్లుప్తంగా

### మర్యాద పూర్వక కలయిక



జక్కంపూడి రాజాను సత్కరిస్తున్న దొడ్డి కిరణ్, పీవీ సురేష్

గోపాలపట్నం: తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆ పార్టీ రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షుడు జక్కంపూడి రాజాను బుధవారం విశాఖ జిల్లా యూత్ అధ్యక్షుడు దొడ్డి కిరణ్ కలిశారు. ఆయనకు శాలువ కప్పి జ్ఞాపిక అందించారు. ఆయనతో పాటు జీవీఎంసీ 60వ వార్డు కార్పొరేటర్ పీవీ సురేష్, గణేష్, వర్మ తదితరులు ఉన్నారు.

### రేపు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గోపాలపట్నం: కొత్తపాలెం సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ లైన్ల నిర్వహణ పనుల కారణంగా శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ పోలాకి శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తపాలెం, నాగేంద్ర కాలనీ, డీఆర్‌నగర్, సంతోష్‌నగర్, భగత్‌సింగ్‌నగర్, యల్లపువానిపాలెం, చంద్రనగర్, నేతాజీ వీధి, గోపాలపట్నం రైల్వే స్టేషన్ రోడ్డు ప్రాంతాల్లో అంతరాయం ఏర్పడుతుందని పేర్కొన్నారు.

### ప్లాస్టిక్ నిషేధంపై విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న శ్రీనివాసరావు

విశాఖ విద్య: విధి నిర్వహణలో అంకితభావంతో పనిచేస్తూ సామాజిక బాధ్యతగా ప్లాస్టిక్ నిషేధంపై జీవీఎంసీ జోన్- 8 శానిటేషన్ ఔట్ సోర్సింగ్ సూపర్‌వైజర్ దమ్ము శ్రీనివాసరావు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాడు. ఎస్‌ఏడీ సెంటర్‌లో బుధవారం విస్తృత ప్రచారం చేశాడు. సింగిల్ యూజ్ ప్లాస్టిక్‌ను నిషేధించి, గుడ్డ సంచులు ఉపయోగించాలని సూచించాడు. మెగా ఫోన్ చేతపట్టి ఎస్ఏడీ సమీపంలోని పలు కాలనీల్లో వాహనంపై తిరుగుతూ ప్లాస్టిక్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. ప్లాస్టిక్ వినియోగం వల్ల కలిగే అనర్థాలను వివరించాడు. దీంతో శ్రీనివాసరావును పలువురు అభినందిస్తున్నారు.

### తాగునీరు వృథా చేస్తే చర్యలు



పైపులను కట్ చేస్తున్న సిబ్బంది

విశాఖ విద్య: జీవీఎంసీ 90వ వార్డులోని పలు కాలనీల్లో తాగునీటిని వృథా చేస్తున్న వారిపై వాటర్‌వర్క్స్ విభాగం అధికారులు కన్నెర్ర చేశారు. నీటిని వృథాగా రోడ్లపైకి వదిలేస్తుండటాన్ని గుర్తించి తగిన చర్యలు చేపట్టారు. వృథా నీటిని అరికట్టాలని పలుమార్లు హెచ్చరించినా కొంతమంది యాజమానుల్లో మార్పు రాకపోవడంతో నివారణ చర్యలు చేపట్టారు. దీనిలో భాగంగా ఆ ఇళ్లకు వెళ్లే జీవీఎంసీకి సంబంధించిన తాగునీటి పైపులైన్‌లను బుధవారం తొలగించారు. తాగునీటిని వృథా చేస్తే ఇలాంటి చర్యలే ఉంటాయని అధికారులు హెచ్చరించారు.

### ఏయూలో ముగిసిన వజ్రోత్సవాలు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయం జియో ఫిజిక్స్ విభాగం ప్లాటినం జూబ్లీ వేడుకలు బుధవారంతో ముగిశాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన సైంటిస్టులు భూగర్భ జలవనరుల వినియోగం, వాటిని కాపాడుకునేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు వంటి అంశాలపై ప్రసంగించారు. ఈ సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి సెమినార్‌లో పాల్గొన్న వక్తలను సన్మానించారు. జాతీయ సదస్సులో భాగంగా వర్సిటీ జియో ఫిజిక్స్ విభాగం భవనం ముందు ఏర్పాటు చేసిన ప్రత్యేక వైజ్ఞానిక ప్రదర్శనను సైంటిస్టులు, ఆచార్యులు, విద్యార్థులు తిలకించారు. భూగర్భ గనుల శాఖ, ఇన్ కాయిస్, ఫిషరీస్ విభాగం, నగర పాలక సంస్థ తదితర ప్రభుత్వ శాఖలు ప్రత్యేకంగా ప్రదర్శన ఏర్పాటు చేశాయి. వేడుకలో భాగంగా 2024 సంవత్సరానికి డాక్టర్ హరినారాయన్ లైఫ్ టైం అచీవ్‌మెంట్ అవార్డు అందుకున్న గీతం స్కూల్ ఆఫ్ సైన్స్ డీన్ ఆచార్య కె.ఎస్.కృష్ణను నిర్వాహకులు ప్రత్యేకంగా సత్కరించారు. కార్యక్రమంలో విభాగాధిపతి ఆచార్య సి.వి.నాయుడు, ఐజీయూ ప్రతినిధి డాక్టర్ ప్రసాద్, ఆచార్య ఎ.రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

---

**నాడు** పారిశ్రామిక ప్రాంత ప్రజలకు చక్కని వైద్య సేవలు అందాయి.అర్ధ రాత్రి అయినా అపరాత్రి అయినా అక్కడికి వెళితే వైద్యం లభిస్తుందనే భరోసా ఉండేది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అవసరమైన మందులతో పాటు స్పెషలిస్టు సేవలు అందించడంతో గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూ పారిశ్రామిక ప్రాంత వాసుల వైద్యానికి పెద్దదిక్కుగా నిలిచింది.

**నేడు** కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ ఆస్పత్రులను నిర్వీర్యం చేస్తోంది. యూపీహెచ్‌సీల్లో స్పెషలిస్టు వైద్య సేవలకు మంగళం పాడింది. మందులు కూడా అరకొరగానే అందిస్తోంది. నిర్వహణకు నిధులు మంజూరు చేయకపోవడంతో ఎఫ్‌ఆర్‌యూలో ఉన్న సౌకర్యాలు కూడా మూలకు చేరాయి. దీంతో పారిశ్రామిక ప్రాంత ప్రజలు వైద్యం కోసం ప్రైవేటు వైద్యులు, ఆస్పత్రులను ఆశ్రయిస్తున్నారు.

# ఆస్పత్రికి సుస్తీ!

- గుల్లలపాలెం ఎఫ్‌ఆర్‌యూలో మందుల కొరత
- మూలకు చేరిన జనరేటర్
- రోగుల మరుగుదొడ్లకు తాళాలు
- పలు సేవలు నిలిపివేత
- తగ్గిన రోగుల సంఖ్య




గుల్లపాలెం ఎఫ్‌ఆర్‌యూ ముఖద్వారం



అలంకారప్రాయంగా జనరేటర్



రోగుల ఓపీ చూస్తున్న సిబ్బంది

మల్కాపురం: పారిశ్రామిక ప్రాంత ప్రజలకు సంజీవినిగా నిలిచిన ఆస్పత్రికి నేడు సుస్తీ చేసింది. మందుల కొరత వేధిస్తోంది. ప్రత్యేక వైద్యుల సేవలకు కోత పడింది. కరెంట్ లేని సమయంలో వెలుగులు పంచాల్సిన జనరేటర్ మూలకు చేరింది. నిర్వహణ లేక మరుగుదొడ్లకు తాళాలు వేశారు. మరోవైపు జీతాలు రాక సిబ్బంది అవస్థలు పడుతున్నారు.

**సిబ్బంది ఇలా**

ఏఎన్‌ఎంలు -4, బీఎన్‌ఎం ( స్టాఫ్ నర్సులు)-3, వాచ్‌మెన్-2, అంబులెన్స్ డ్రైవర్-1, ఆయాలు -4, ల్యాబ్‌టెక్నీషియన్-1, ఫార్మసిస్ట్ -1

**తగ్గిన వైద్యుల సేవలు**

గైనిక్, ,చిల్డ్రన్ వైద్యులు లేరు. గతంలో స్కిన్ వైద్యులు వారంలో రెండు సార్లు వచ్చేవారు. నేడు మంగళవారం ఒక రోజు మాత్రమే వస్తున్నారు. ఈఎన్‌టీ గురువారం ఒక పూట మాత్రమే చూస్తున్నారు. దంత వైద్యులు ఉన్నారు.

**మందులు అరకొరే..**

నొప్పులకు,జ్వరానికి,యాంటీబెటిక్ మందులు తప్పా మిగిలిన మందులు లేవు. ఓపీ చీటీలో రాసిన కొన్ని మందులు బయట కొనుగోలు చేయాల్సి రావడంతో రోగులు ఇబ్బంది పడుతున్నారు.

**వైద్య సిబ్బందికి అందని జీతాలు**

ఇక్కడ పని చేస్తున్న వైద్య సిబ్బందికి మూడు నెలల నుంచి జీతాలు లేవు.దీంతో పండగ పూట కూడా వారు పస్తులు ఉండాల్సిన పరిస్థితి ఏర్పడింది.

### ప్రసూతి వైద్యశాలకు తాళాలు



తాళం వేసి ఉన్న ఆస్పత్రిలో చిల్డ్రన్ వార్డు, ఆపరేషన్ థియేటర్

ఆస్పత్రి వెనుక లక్షల వ్యయంతో ప్రసూతి, పిల్లల వైద్య సేవలకు 2013లో ప్రత్యేక గదులు నిర్మించారు. అయితే ఈ రెండు విభాగాల్లో వైద్య నిపుణులు లేకపోవడంతో ఆ గది తాళం వేసి ఉంది. దీంతో విలువైన వైద్య పరికరాలు, బెడ్స్ నిరుపయోగంగా మారాయి.

### ఇదీ పరిస్థితి

జీవీఎంసీ 60వ వార్డు గుల్లపాలెం వద్ద 25 ఏళ్ల కిందట 30 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేశారు. దీంతో పారిశ్రామిక ప్రాంతంలోని ఏడు వార్డుల పేద ప్రజలు ఇక్కడకు వచ్చి అవసరమైన వైద్య సేవలు పొందేవారు. నాడు నిత్యం సుమారు 200 నుంచి 300 మంది వరకు ఓపీ సేవలు పొందేవారు. నెలలో 5 నుంచి 10 మంది శస్త్ర చికిత్సలు జరిగేవి. ప్రస్తుతం ఆస్పత్రిలో సౌకర్యాలు లేకపోవడంతో రోగుల సంఖ్య తగ్గుతోంది. రోజు 100 నుంచి 150 మాత్రమే ఓపీ నమోదవుతోంది. ప్రసూతి వైద్య సేవలు నిలిచాయి. గైనిక్ వైద్యులు లేకపోవడం, రోగులకు అవసరమైన మందులు లభించక పోవడంతో ఆస్పత్రికి వచ్చేందుకు రోగులు నిరాకరిస్తున్నారు.



శస్త్ర చికిత్సలు చేయక పోవడంతో ఖాళీగా ఆపరేషన్ థియేటర్

### స్పెషలిస్టు వైద్యులు లేరు

గైనిక్ సమస్యపై వైద్యం చేయించుకోవడానికి గత వారం ఆస్పత్రికి వెళ్లాను. వైద్య నిపుణులు లేరని చెప్పారు. దీంతో గాజువాకలో ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి వైద్యం చేయించుకున్నారు. ప్రభుత్వ ఆస్పత్రి అందుబాటులో ఉన్నా పేదలకు అవసరమైన వైద్య సేవలు అందకపోతే ఎలా..?

– సీహెచ్.పద్మావతి, కోరమాండల్ గేటు ఏరియా

### మందులు లేవు

విధి నిర్వహణలో గాయం కావడంతో గుల్లలపాలెం వద్ద గల ఎఫ్‌ఆర్‌యూ ఆస్పత్రికి వెళ్లాను.అక్కడ జనరల్ వైద్యులు వైద్యం చేశారు. అయితే అవసరమైన మందులు లేకపోవడంతో బయట మెడికల్ స్టోర్‌లో కొనుక్కోవాల్సిన పరిస్థితి కలిగింది. ప్రభుత్వం పూర్తిస్థాయిలో మందులు సరఫరా చేయాలి.

– అన్నెపు సూర్యనారాయణ, ఏకేసీకాలనీ

---

## కార్పొరేట్లకు అనుకూలంగా కేంద్ర బడ్జెట్

- ఆర్థిక వేత్త ఆచార్య పద్మ



సమావేశంలో పాల్గొన్న సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు

మల్కాపురం: కేంద్ర ప్రభుత్వం ఇటీవల ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్పొరేట్లకు అనుకూలంగా ఉందని, సామాన్య ప్రజల అవసరాలను నిర్లక్ష్యం చేసిందని ప్రముఖ ఆర్థికవేత్త ఆచార్య కె.పద్మ అన్నారు. కేంద్రం బడ్జెట్‌పై మల్కాపురం సెయింట్ మహిళా కళాశాలలో బుధవారం నిర్వహించిన సదస్సులో ఆమె ప్రసంగించారు. నిరుద్యోగం, తక్కువ వేతనాలు, ఆర్థిక సంక్షోభం వంటి సమస్యలకు ఈ బడ్జెట్ పరిష్కారం సూచించలేదని ఆమె అన్నారు. ఆరోగ్యం, విద్య, గ్రామీణ అభివృద్ధి వంటి ముఖ్యమైన రంగాలకు తగిన నిధులు కేటాయించలేదన్నారు. ఈ బడ్జెట్ అసమానతలు పెంచేదిగా ఉందని ఆమె ఆరోపించారు.కార్యక్రమంలో సెయింట్ ఆన్స్ కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ప్రతి మహిళ పారిశ్రామిక వేత్త కావాలి



జ్యూట్ బ్యాగ్స్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభిస్తున్న కోరమాండల్ డీజీఎం శ్రీనివాసరావు

మల్కాపురం: ప్రతి మహిళా తన శక్తిని చూపి సొంతంగా చిన్న పరిశ్రమలు స్థాపించే స్థాయికి ఎదగాలని కోరమాండల్ ఇంటర్నేషనల్ సంస్థ డీజీఎం (హెచ్‌ఆర్) రెడ్డిపల్లి శ్రీనివాసరావు అన్నారు. 58వ వార్డు ఎదురవానిపాలెంలోని సామాజికభవనం వద్ద స్థానిక మహిళలు,యువతులకు జ్యూట్ బ్యాగులు కుట్టే విధానంపై ఏర్పాటు చేసిన శిక్షణ తరగతులను బుధవారం ఆయన ప్రారంభించారు. పర్యావరణానికి హాని చేస్తున్న ప్లాస్టిక్‌కు ప్రత్యామ్నాయంగా ప్రతి ఒక్కరూ క్లాత్, పేపర్ బ్యాగులు వినియోగించాలని కోరారు. 35 మంది మంది మహిళలకు 45 రోజుల పాటు జ్యూట్ బ్యాగుల తయారీపై శిక్షణ ఇస్తామన్నారు. కార్యక్రమంలో సంస్థ వైద్యులు ఉదయ్,డిప్యూటీ మేనేజర్ ( సీఎస్‌ఆర్ )శేషపు వెంకటరమణ, ధర్మాల వేణుగోపాల్‌రెడ్డి గ్రామ పెద్దలు తోణంగి వెంకటరమణి యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## రైతు బజారులో విజిలెన్స్ తనిఖీలు



గోపాలపట్నం రైతు బజారులో తనిఖీలు చేస్తున్న అధికారి పాపారావు

గోపాలపట్నం: గోపాలపట్నం రైతు బజారులో బుధవారం విశాఖ జిల్లా విజిలెన్స్ టీమ్ తనిఖీలు చేపట్టింది. సెలక్షన్ గ్రేడ్ సెక్రటరీ పి. పాపారావు, వ్యవసాయ మార్కెటింగ్ అధికారి యాసిన్, డిప్యూటీ డైరెక్ట్ కిరణ్, పెందుర్తి, భీమిలి ఏఎంసీ సెక్రటరీలు అరుణ, లక్ష్మీ చైతన్య తనిఖీల్లో పాల్గొన్నారు. రైతులు పండిస్తున్న పంటల గురించి వివరాలు సేకరించారు. వారి గ్రామాల్లో రైతులు ఏఏ పంటలు పండిస్తున్నారు... ఎక్కువ పంటలు పండించే రైతులు ఏ విధంగా పంటలు విక్రయిస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. పంటలను రైతులు నేరుగా రైతు బజారులో అమ్ముకునేందుకు ప్రభుత్వం అవకాశం కల్పిస్తుందని వివరించారు. రైతులు హోల్ సేల్‌గా అమ్మడం వల్ల నష్టపోతారని తెలిపారు. దగ్గరలో ఉన్న రైతు బజారుకు సరకులు తీసుకువెళ్లి ఎస్టేట్ అధికారికి తెలియజేసి విక్రయించుకోవచ్చని సూచించారు.

## మరమ్మతులు ప్రారంభం



అంబేడ్కర్ సామాజిక భవనం వద్ద మెట్ల నిర్మాణ పనులను పరిశీలిస్తున్న నాయకులు

సింధియా: జీవీఎంసీ 62వ వార్డు పరిధి అంబేడ్కర్‌కాలనీలోని అంబేడ్కర్ సామాజిక భవనం ముందు ఉన్న డ్రైనేజీ మెట్లు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో అంబేడ్కర్ సామాజిక సేవా సంఘం సభ్యులు సమస్యను వార్డు కార్పొరేటర్ బల్ల లక్ష్మణరావు దృష్టికి తీసుకువెళ్లారు. వెంటనే ఆయన జీవీఎంసీ అధికారులతో మాట్లాడి డ్రైనేజీ మెట్ల పునర్నిర్మాణానికి నిధులు మంజూరు చేయించారు. బుధవారం మెట్ల నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో వార్డు కార్పొరేటర్ లక్ష్మణరావుకు సంఘ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. నిర్మాణ పనులను సంఘ అధ్యక్షుడు రావాడ అప్పారావు, నాయకులు ఆడారి నాగరాజు పర్యవేక్షించారు.

## ఛత్రపతి శివాజీకి ఘన నివాళి



శివాజీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు



క్రాంతినగర్‌లో శివాజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

మల్కాపురం: ఛత్రపతి శివాజీ 389వ జయంతిని 59వ వార్డు ములగాడ హౌసింగ్‌కాలనీలో బీజేపీ నాయకులు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఆ పార్టీ ములగాడ మండల అధ్యక్షుడు లక్కరాజు రామకృష్ణ, ఎస్సీ మోర్చ నాయకుడు కొక్కిలిగడ్డ విజయబాబు,పార్టీ ప్రధాన కార్యదర్శి పొలిమేర శ్రీనివాసరావు తదితరులు శివాజీ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం వారు మాట్లాడుతూ హిందూ ధర్మం కోసం ఆయన అనేక పోరాటాలు చేశారని కొనియాడారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.గురుమూర్తి, మల్లు రవి తదితరులు పాల్గొన్నారు.

**క్రాంతినగర్‌లో..**

సింధియా: జీవీఎంసీ 63వ వార్డు క్రాంతినగర్‌లో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి బీజేపీ నాయకులు అనిల్‌కుమార్, రాజేంద్రప్రసాద్, కుమార్ తదితరులు నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ మరో ఛత్రపతి శివాజీలా దేశ ప్రధాని నరేంద్రమోదీ పాలన సాగిస్తున్నారన్నారు. కార్యక్రమంలో శ్రీనివాస్, అశోక్, రేలంగి, నాగరాజు, శంకర్, వెంకట్, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## 48 మందికి క్యాంపస్ కొలువులు




ఎంపికైన విద్యార్థులతో అధ్యాపకులు, కంపెనీ ప్రతినిధులు

గోపాలపట్నం: బెహరా ఇంజినీరింగ్ కళాశాలలో బుధవారం నిర్వహించిన క్యాంపస్ ఇంటర్వ్యూల్లో 48 మంది విద్యార్థులు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ అనిల్ తెలిపారు. చెన్నైకి చెందిన రోయల్ ఎన్‌ఫీల్డ్ యాజమాన్యం బుధవారం క్యాంపస్ ఇంటర్వ్యూలు నిర్వహించారు. పాలిటెక్నిక్ చివరి సంవత్సరం విద్యార్థులు ఎంపికలో పాల్గొన్నారు. ఇందులో 48 మంది విద్యార్థులు ఎంపికయ్యారు. వీరికి ఏడాదికి రూ.2.24లక్షలు జీతంగా పేర్కొన్నారు. ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులను కళాశాల ప్రిన్సిపాళ్లు అనిల్, భరత్ అభినందించారు. రాయల్ ఎన్‌ఫీల్డ్ హెచ్‌ఆర్ ఆర్ శ్రీనివాసరావు, కళాశాల అధ్యాపకులు పాల్గొన్నారు.

## కుటుంబ సభ్యులకు అప్పగింత

సీతమ్మధార: ఏయూటీడీ పర్యవేక్షణలో 2023 నుంచి చికిత్స తీసుకుంటున్న బండెల అన్నమ్మ (45)ను కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఏయూటీడీ కార్యదర్శి ప్రగడ వాసు తెలిపారు. కడప నుంచి బస్సులో విశాఖ మానసిక ఆస్పత్రిలో చేర్చడానికి తీసుకొచ్చిన 35 మందిలో బండెల అన్నమ్మ ఒకరని, వ్యాధి నయం కావడంతో ఏయూటీడి సిబ్బంది ఫిబ్రవరి 5న టీఎస్‌ఆర్ మహిళా షెల్టర్ హోమ్‌కు తరలించారని తెలిపారు. ఆమె చెప్పిన అడ్రస్ ప్రకారం కడప సమీపంలోని అరవపల్లి శ్రద్ధ ఫౌండేషన్ సభ్యులు గౌతమ్, పింకీ జెనా తీసుకెళ్లి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలి



సమావేశంలో మాట్లాడుతున్న పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి

మురళీనగర్ : విద్యార్థులు వ్యసనాలకు దూరంగా ఉండాలని, చదువుపై దృష్టి సారించాలని నగర పోలీసు కమిషనర్ శంఖబ్రత బాగ్చి సూచించారు. శ్రీదేవి విజ్ఞాన జ్యోతి పరిష్కార్ చారిటబుల్ ట్రస్టు చైర్‌పర్సన్ కీర్తి పట్నాయక్ అధ్యక్షతన మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ఉన్నత లక్ష్యాల సాధన అనే అంశంపై బుధవారం నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన ప్రసంగించారు. విద్యార్థులు పరీక్షలకు భయపడకూడని, ఇష్టంతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాన్ని సాధించవచ్చన్నారు. పెద్దలను గౌరవించాలన్నారు. క్రమశిక్షణతో కూడిన విద్యను అభ్యసిస్తే ఉన్నత స్థానానికి చేరుకోవచ్చని చెప్పారు. మంచి అలవాట్లతో ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. విద్యార్థి దశలో యువతీ యువకులు ప్రేమ, వ్యామోహంలో పడి జీవితాలను నాశనం చేసుకుంటున్నారని చెప్పారు. సోషల్ మీడియా పరిచయాలు మానుకోవాలని, జీవితంలో స్థిరపడేందుకు మంచిగా చదువుకుని ఉద్యోగాలు సాధించాలన్నారు. సైబర్ నేరాల పట్ల యువత అవగాహన కలిగి ఉండాలని సూచించారు. బాలికలు, మహిళలు ఆపద సమయంలో 112 నంబరుకు డయల్ చేయడం లేదా, సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ఏఆర్ పృథ్వీతేజ, కంచరపాలెం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.రవికుమార్, హెచ్‌ఎం బి.హేమలత, సీడీపీవో రామకుమారి, చింతాడ అచ్యుతరామారావు, సనపల వరప్రసాద్ పాల్గొన్నారు.

## చక్కని బోధనతో ఉత్తమ ఫలితాలు



శిక్షణ అందిస్తున్న సీడీపీవో రమణకుమారి

మద్రిపాలెం : మూడు నుంచి ఆరు సంవత్సరాల మధ్య వయసు గల పిల్లలకు ప్రాథమిక స్థాయిలో చక్కగా బోధించి బలమైన పునాది వేస్తే మంచి ఫలితాలు లభిస్తాయని, ఉత్తమ విద్యార్థులుగా ఎదుగుతారని అర్బన్ సీడీపీవో ఎంవీ రమణకుమారి సూచించారు. ఈ మేరకు బుధవారం 50వ వార్డు మాధవధార జీవీఎంసీ ఉన్నత పాఠశాలలో సమగ్ర శిక్ష, మహిళ శిశు సంక్షేమ శాఖ సంయుక్తంగా నిర్వహించిన జ్ఞాన జ్యోతి సమగ్ర శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. అంగన్‌వాడీ ప్రాథమిక పాఠశాలలను బలోపేతం చేయడానికి ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగపడుతందన్నారు. విద్యతోపాటు ఆరోగ్య సంరక్షణ కూడా ఎంతో అవసరమని, అంగన్‌వాడీ వర్కర్లకు మెరుగైన శిక్షణ ఇస్తే వారు అనుకున్న లక్ష్యాలను చేరుకోవచ్చని తెలిపారు. అందుకు ఈ జ్ఞానజ్యోతి కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఈవో సోమేశ్వరరావు, ఎంఈవో దివాకర్, రాఘవేంద్ర, తాబిత జ్యోతి, సాయికుమార్, దొరబాబు, అంగన్‌వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు ప్రమాద బీమా



మాట్లాడుతున్న జిల్లాప్రజా రవాణా అధికారి అప్పలనాయుడు

డాబాగార్డెన్స్: ఏపీఎస్‌ఆర్‌టీసీలో కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ కార్మికులకు రూ.10లక్షల ప్రమాద బీమా వర్తింపజేస్తూ ఆర్టీసీ యాజమాన్యం బుధవారం ఆదేశాలు జారీ చేసింది. ఈ సందర్భంగా జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు పోస్టల్ అధికారులు, పర్సనల్ ఆఫీసర్, అకౌంట్స్ ఆఫీసర్, అసిస్టెంట్ ట్రాఫిక్ మేనేజర్, అన్ని డిపో అధికారులతో తన చాంబర్లో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని అద్దె బస్సుల డ్రైవర్లు, పొరుగు సేవల డ్రైవర్లు, బస్సు అటెండర్లు, బస్టాండ్ గ్యారేజ్, ఆర్టీసీ కార్యాలయాల్లో పని చేసే ఔట్‌సోర్సింగ్ స్వీపర్లు, ట్రాఫిక్ గైడ్లు, కౌంటర్లలో టికెట్స్ బుక్ చేసే సిబ్బంది, ఇతర ఉద్యోగులందరికీ ప్రమాద బీమా వర్తిస్తుందని చెప్పారు. పోస్టల్ శాఖ అంత్యోదయ శ్రామిక్ సురక్ష యోజన కింద ఈ బీమా అమలు చేయనున్నట్టు తెలిపారు.

## పుస్తక పఠనంతో మనో వికాసం



పుస్తక సమీక్ష చేసిన విద్యార్థులతో కళాశాల సెక్రటరీ మధుకుమార్

సీతంపేట : నేటి తరం విద్యార్థులు పుస్తకం చదవడం కన్నా, మొబైల్ ఫోన్ ద్వారా వారికి కావాల్సిన సమాచారాన్ని పొందటానికి ప్రయత్నం చేస్తున్నారని లంకపల్లి బుల్లయ్య కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ జి.మధుకుమార్ అన్నారు. బీకాం, బీబీఏ విద్యార్థులకు కేవలం పాఠ్య పుస్తకాలు చదవడం మాత్రమే కాకుండా, గ్రంథ సమీక్ష చేయడంలో కూడా శిక్షణ ఇచ్చే కార్యక్రమం నిర్వహించారు. తొమ్మిది మంది విద్యార్థులు వారికి సూచించిన గ్రంథాలను సమీక్షించి ప్రతిభ కనబర్చారు. ఈ సందర్భంగా కళాశాలలో బుధవారం జరిగిన గ్రంథ సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పుస్తక పఠనం, సమీక్ష చేయడం మనోవికాసానికి దోహదపడతాయన్నారు. కళాశాల విద్యార్థులు ట్రయానా, ఉషశ్రీ, ప్రణీత, ఇనయత్ ఆలీ, శ్రేయ, బి.తనూష, రమ్య, రాథోడ్, ఆమీర్ రాత్రే గ్రంథ సమీక్ష చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ జి.ఎస్.కె.చక్రవర్తి, దీపక్ చౌదరి, సోమేశ్వరరెడ్డి, అధ్యాపకులు రియాజ్ మొహమ్మద్, రంగనాయకులు, బి.శ్రీనివాసరెడ్డి, మహేష్ పాల్గొన్నారు.